

## కోడిపందేల బరులు ధ్వంసం



బరులు ధ్వంసం చేయిస్తున్న ఎస్ఐ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరులను ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. ఈడేపల్లిలోని అల్లూరు సోమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో పందేల నిర్వాహకులు ట్రాక్టర్‌తో బరులు సిద్ధం చేస్తుండగా ఎస్ఐ అడ్డుకుని బరులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఒక్క అంగన్‌వాడీని తొలగించినా తీవ్ర ప్రతిఘటనే

- ఉపాధ్యాయ, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి
- రాజకీయ, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు
- ముగిసిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు
- బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన మద్దతు రాష్ట్రానికి తీవ్ర ద్రోహం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

అంగన్‌వాడీల్లో ఏఒక్కరిని తొలగించినా తీవ్ర ప్రతిఘటన తప్పదని, వారి సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే వైసిపి ప్రభుత్వం పతనం కావడం ఖాయమని సిపిఎం రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధ, గురువారాల్లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. వివిధ జిల్లాల నుంచి 65 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశాల్లో రాజకీయ, ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు సమావేశాల్లో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేశారు. తొలిరోజు బుధవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. మధ్యాహ్నం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు మీడియాతో దేశ, రాష్ట్ర రాజకీయాలతోపాటు ప్రజాసమస్యలపై మాట్లాడారు. మధ్యాహ్నం రాష్ట్ర కమిటీ సమావేశాలు కొనసాగాయి. రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక శక్తులను కూడగట్టి ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన మద్దతు పలకడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు రోడ్డున పడి 31 రోజులు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీలంతా సంక్రాంతి పండుగ జరుపుకునేలా చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన ఫలితం అనుభవించాల్సి ఉంటుందన్నారు. అంగన్వాడీల సమ్మెపై ప్రజల నుంచి సానుభూతి ఉందన్నారు. 32 లక్షల మంది తల్లీ బిడ్డలకు రక్షణగా ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోయి అంగన్వాడీలను చీల్చడం, అణిచివేయడం చేస్తే వైసిపికి రాజకీయంగా ఎదురుదెబ్బ తప్పదన్నారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలూ కలిసి రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ప్రతియేటా జనవరిలో జాబ్‌క్యాలెండర్ అంటూ ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. మెగా డిఎస్‌సి కోసం ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి వేయడం లేదన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించడంతోపాటు 104, 108, ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం రోజురోజుకీ ప్రజాదరణ కోల్పోతుందన్నారు. సంక్షేమ పథకాలతో ఓట్లు వస్తాయనుకుంటే చెల్లదని, అది వైసిపి రాజకీయ ఉనికికే ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

# సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి

## సంబరాలను ప్రారంభించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



పతంగులు వేస్తున్న ప్రముఖులు

**ప్రజాశక్తి - ఏలూరు**

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం ఎపి సాహిత్య అకాడమీ, జిల్లా అధికార యంత్రాంగం, వైఎంహెచ్ఎ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఎ హాలులో సంక్రాంతి సంబరాలు ఎపి సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగాయి. ఈ సంబరాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా కుటుంబ సమేతంగా కలిసి చేసుకునే ప్రత్యేకమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. సంక్రాంతి పండుగ ద్వారా కుటుంబ వ్యవస్థ బలపడటమే కాకుండా నేటి సమాజంలో యువతకు సంస్కృతీ సంప్రదాయాలపై మక్కువనూ పెంచుతోందన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందానిచ్చిందన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలుగు సంప్రదాయాలను ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, నగర డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్ బాబు, జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, సెట్‌వెల్ సిఇఒ మెహర్‌రాజ్, నాట్యాచార్య కెవివి.సత్యనారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగి మంట, గంగిరెద్దులు, హరిదాసులు, సంక్రాంతి ముగ్గులు, గాలిపటాలు, తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించిన బాలలు, కోలాటం తదితర కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం జెసి లావణ్యవేణి చేతులమీదుగా 10 మందికి విశిష్ట సాహిత్య పురస్కారాల కింద రూ.10 వేల నగదు అందజేయగా వారిని సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి భరతనాట్య ప్రదర్శన కళాకారులు, కవులు, సాహిత్యవేత్తలు, వివిధ కళారూపాల కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.



భోగి మంటలు



పోటీలను ప్రారంభిస్తున్న సునీల్‌కుమార్

# యువత క్రీడలపై దృష్టి సారించాలి

## ఫైర్ డిజిపి పివి.సునీల్‌కుమార్

**ప్రజాశక్తి - చింతలపూడి**

యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు నివారణ శాఖ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలో గ్రేస్ గార్డెన్ వద్ద ఎయిమ్ అధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని, ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణమన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, అప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఆకాంక్షించారు. అనంతరం నందమూరి కాలనీలో అంబేద్కర్ భవన పున:నిర్మాణ పనులను పర్యవేక్షించారు. త్వరలో లైబ్రరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన దళిత నేత బండి ఆశీర్వాదం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిమ్ ప్రెసిడెంట్ వాసే ఆనంద్, సెక్రటరీ పి.రాంబాబు, జిల్లా కోకన్వీనర్ జి.రాజు, నేతలు కాకర్ల సత్యం, ఎన్ఎస్.రాజేంద్రకుమార్, కె.బుచ్చిబాబు, క్రీడా పోటీల ఆర్గనైజర్ రజని, కె.నాగేశ్వరరావు, పిఇటిలు పి.వేణు, ఎమ్‌డి.యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాడి రాయితీలు సాధించుకున్నారు..



ఏలూరులో మాట్లాడుతున్న బి.సోమయ్య

**ప్రజాశక్తి - ఏలూరు**

మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె పోరాటంతో కొన్నైనా రాయితీలు సాధించుకున్నారని, పోరాడి విజయం సాధించిన కార్మికులకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య అభినందనలు తెలిపారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 26వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపట్టారన్నారు. 16 రోజుల సమ్మె పోరాటంతో ప్రభుత్వం దిగొచ్చి కొన్ని సమస్యలు పరిష్కరించిందని తెలిపారు. స్థానిక ఆర్ఆర్‌పేట పార్కు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన సమ్మె విరమణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల రాష్ట్రవ్యాప్తంగా పిఆర్‌సికి అనుగుణంగా జీతాల పెంపుదల అమలు కాలేదన్నారు. అయినప్పటికీ కొన్ని విభాగాల కార్మికులకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, చెత్త వాహనాల డ్రైవర్లు, మలేరియా విభాగం వర్కర్లకు రూ.ఆరు వేలు చొప్పున జీతాల పెంపుదల జరిగిందన్నారు. విలీన పంచాయతీల కార్మికులకు కూడా రూ.ఆరు వేల వేతన పెంపు జరిగిందన్నారు. దహన సంస్కారాల ఖర్చు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెరిగిందని, మొదటిసారిగా రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.75 వేలు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. సమ్మెకాలపు వేతనాలు, పండుగ బహుమతి, పర్మినెంట్ సిబ్బందికి సరెండర్ లీవులు సాధించుకున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం వర్కర్లకు ప్రభుత్వ మొండివైఖరి వల్ల జీతాలు పెరగలేదని, రానున్న కాలంలో ఇంజినీరింగ్ విభాగం వర్కర్లకు జీతాల పెంపుదల, స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాల కోసం అందరినీ ఐక్యం చేసి బలమైన ఉద్యమం చేపడతామని తెలిపారు. పబ్లిక్ హెల్త్ విభాగం వారికి రెండు భాగాలుగా ఇస్తున్న వేతనం, హెల్త్ అలవెన్స్ కలిపి రూ.21 వేలు వేతనంగా మార్చడం వల్ల రానున్న వేతన పెంపకాల్లో కార్మికులకు మేలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. పారిశుధ్య విభాగం కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. స్కూల్ స్వీపర్ల బకాయి వేతనాలు, జీతాల పెంపుదల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు జనవరి నెలాఖరు వరకు కాంట్రాక్టర్, అధికారులు, కార్మిక సంఘాలతో సమావేశం జరిపి వేతనాల పెంపుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. సర్వీసులో ఉండగా సహజ మరణం పొందిన వారికి ఇచ్చే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా అమలుకు చర్యలు తీసుకుంటామని, ప్రమాదవశాత్తూ చనిపోయిన వారికి ఇస్తామన్న రూ.5 లక్షలు రూ.ఏడు లక్షలకు పెంచుకోగలిగామని వివరించారు. అన్ని సంఘాలు ఐక్యంగా ఒకేసారి పోరాడి ఉంటే మరిన్ని విజయాలు సాధ్యమయ్యేవన్నారు. సంఘాల మధ్య ఐక్యత లేకపోవడంతో ప్రభుత్వం దాన్ని ఉపయోగించుకుని కార్మికులకు ఇచ్చిన హామీలు, పెంచాల్సిన రాయితీలు పెంచలేదని తెలిపారు. రానున్న కాలంలో మరింత ఐకమత్యంతో కార్మికులకు మెరుగైన రాయితీల కోసం ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ సమ్మె పోరాటానికి అనేక రకాలుగా సహాయ, సహకారాలు అందించిన కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలకు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడారు. వివిధ విభాగాలకు చెందిన వందలాది మంది కార్మికులు హాజరయ్యారు. ప్రభుత్వం సమ్మె విరమణ చర్చల్లో అంగీకరించిన అంశాలకు వెంటనే జిఒలు విడుదల చేసి వెంటనే అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకే సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పామని తెలిపారు.

**నూజివీడు రూరల్:** మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నట్లు సిఐటియు పట్టణ కార్యదర్శి జి రాజు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని డిమాండ్లను పరిష్కరించడంతో సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నామన్నారు.



హక్కు పత్రాలు చూపుతున్న రైతులు

## గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

**టి.నరసాపురం:** మండలంలోని కేతవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిలిపి వేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు గురువారం జెసిబిని అడ్డుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సర్వే నెంబర్-1/1లో సుమారు 1165 ఎకరాల భూమి ఉంది. 2004లో 420 ఎకరాలు అప్పటి ప్రభుత్వం పేదలకు భూపంపిణీ చేయగా 2017లో మళ్లీ 116 మందికి పట్టాలిచ్చింది. గురువారం ఆ భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బంది గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అధికారపార్టీ నేతలు కొందరు తమకున్న కొద్దిపాటి భూమిని తమకు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణను వివరణ కోరగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వారు సర్వే నెంబర్-1/1లో గ్రావెల్ తవ్వడానికి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారని, ప్రస్తుతం ఇరుపక్షాలకు సర్దిచెప్పామన్నారు. కార్యక్రమంలో ఘంటా బుజ్జిబాబు, బొడ్డపాటి నవీన్, అగ్నిపర్తి సాంబయ్య, పరసా రాము, కాకాని మంగపతి, కొమ్ముకూరి మంగయ్య, బత్తుల చిననాగేశ్వరరావు, డోలా రామయ్య పాల్గొన్నారు.

# మొండి వైఖరి వీడకుంటే.. పోరు ఆగదు



చింతలపూడిలో..



నూజివీడులో..

## 31వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



జీలుగుమిల్లిలో

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

అంగన్వాడీల సమ్మె గురువారం 31వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద 31 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడగా యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగ వేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీత, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.మంగ, శ్రీదేవి, నుర్జహన్ పాల్గొన్నారు.

**ముసునూరు:** స్థానిక సచివాలయం వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ నేతలు పల్లిపాము రాజకుమారి, కలపాల విద్యావతి, మేరీ సులోచన, దుర్గ, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శిరీష పాల్గొన్నారు.

**చింతలపూడి:** అంగన్వాడీల సమ్మె 31వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు మాట్లాడారు.

**నూజివీడు రూరల్:** పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు నేత వై.ఆదిలక్ష్మి మాట్లాడగా పట్టణ నేతలు ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం, రమాదేవి పాల్గొన్నారు.

**చాట్రాయి:** అంగన్వాడీల సమ్మెలో గురువారం ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినదించారు. కార్యక్రమానికి ప్రమీలరాణి, సుమలత, పద్మ నాయకత్వం సిఐటియు నాయకులు మేడేపల్లి హోలీ మేరీ పాల్గొన్నారు.

**కలిదిండి:** అంగన్వాడీలు సమ్మె సమరోత్సాహంతో సాగించారు. అంగన్వాడీలు తమకు పోస్టులో వచ్చిన షోకాజ్ నోటీసులను తిరిగి పోస్టుమేన్‌కు ఇచ్చి నిరసన తెలిపారు. ఒబిసి నాయకులు లావేటి వీరశివాజీ సమ్మెకు మద్దతు తెలిపారు. నేతలు షేక్ అబిదాబేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, నాయకత్వం వహించారు.

**జీలుగుమిల్లి:** అంగన్వాడీలు తమ 31వ రోజు సమ్మెలో భాగంగా గురువారం 31 అంకె రూపంలో కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నేత కొండలరావు, అంగన్వాడీ నేతలు నాగమణి, సరళ, ఎస్తేరు, జ్యోతి, పూర్ణ పాల్గొన్నారు.

**పోలవరం:** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, అంగన్వాడీ నేతలు పద్మ, సత్యవేణి, సరస్వతి, జుబేదా, సత్యవతి పాల్గొన్నారు.

**నిడమర్రు:** అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఇళ్లకు షోకాజ్ నోటీసులు అతికించడాన్ని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నినదించారు. భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమానికి ఎస్‌కె.రబియా, సుభాషిణి, వెంకటలక్ష్మి, కెవి.సత్యవతి, ధనలక్ష్మి, వరలక్ష్మి, పద్మావతి తదితరులు నాయకత్వం వహించారు.

**ఆగిరిపల్లి:** అంగన్వాడీలు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినదించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం 31వ రోజు కొనసాగించారు. కార్యక్రమంలో నేతలు అన్నమ్మ, అనూరాధ, పుల్లమ్మ, భవాని, రాజ్యలక్ష్మి, జ్యోతి, రూప, కరుణ పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** ముదినేపల్లిలో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు పలువురు సందర్శిం చి సంఘీభావం తెలిపారు. కైకలూరుకు చెందిన వీరశివాజీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# వైసిపి చింతలపూడి ఇన్‌ఛార్జిగా విజయరాజు



**ప్రజాశక్తి - చింతలపూడి**

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విజయరాజు పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. దీంతో సిట్టింగ్ ఎంఎల్ఎ ఎలిజాకు మరోసారి టిక్కెట్ దక్కని పరిస్థితి ఏర్పడింది. రవాణా శాఖలో ఉద్యోగి పని చేసిన విజయరాజు స్వగ్రామం లింగపాలెం మండలం మఠంగూడెం. విజయరాజుకు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో బంధుగణంతోపాటు మంచి పరిచయాలు ఉన్నట్లు ఆయన అనుయాయులు చెబుతున్నారు.

# అంబేద్కర్ జీవితం భావితరాలకు తెలియాలి

## కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ - ఘనంగా 'సామజిక సమతా సంకల్పం'



బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎస్‌పి



సంతకం చేస్తున్న ఎస్‌పి

**ప్రజాశక్తి - ఏలూరు**

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవితాన్ని భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. విజయవాడలో ఈ నెల 19న అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం సామజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్‌తోపాటు జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్‌పి మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, పలువురు జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో అన్నింటికన్నా ముఖ్యమైంది రూల్ ఆఫ్ లా అని, రాజ్యాంగం దానిని నిర్దేశిస్తుందని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రచించి 75 సంవత్సరాలైనప్పటికీ ప్రపంచంలోని పెద్ద దేశాలన్నీ మన రాజ్యాంగాన్ని ఆదర్శంగా తీసుకుని వారి దేశాల రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాయన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని అందించిన భారతరత్న అంబేద్కర్ మన దేశ జాతి గర్వించదగిన వ్యక్తి అని కొనియాడారు. విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు ప్రతిపాదన సమయంలో తాను విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్నానని గుర్తు చేశారు. సిటీలో ఏ ప్రాంతం నుండి చూసినా కన్పించేలా అంబేద్కర్ విగ్రహం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పి, పిడబ్ల్యుడి గ్రౌండ్స్‌ను ఎంపిక చేశారన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో తాను పాలుపంచుకున్నందుకు ఎంతగానో గర్వపడుతున్నానని, విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ తిలకించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక కులానికిగాని, వర్గానికిగాని చెందినవారు కాదని, అంబేద్కర్ అందరివాడని అన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ అంబేద్కర్ ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అని, ఆయన జీవితం భారత జాతికి గర్వకారణమని అన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుండి 19వ తేదీ వరకు అంబేద్కర్ జీవితంపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 3 కె రన్ వంటి పలు కార్యక్రమాలు ప్రతిరోజూ నిర్వహిస్తున్నామన్నారు. డిఆర్‌డిఎ పీడీ కె.విజయరాజు మాట్లాడుతూ అంబేద్కర్ నిత్య విద్యార్థి అని, తన జీవితంలో వేలాది పుస్తకాలు చదివి, ఎంతో విజ్ఞానాన్ని సంపాదించారన్నారు. డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయవాడలో అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు, ఆ ప్రదేశంలో నిర్మిస్తున్న కన్వెన్షన్, లైబ్రరీ, గార్డెన్ తదితరాల విశేషాలను వివరించారు. కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ సూర్యప్రకాశరావు, డిఇఒ శ్యామ్‌సుందర్, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, గృహనిర్మాణ శాఖాధికారి కె.రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ కేదారేశ్వరరావు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు జాన్ మునుల గురునాథ్, మైనారిటీస్ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ నెర్సు చిరంజీవులు, జాతీయ ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు తోకల రాజేష్, వివిధ సంఘాల నాయకులు పెరికే వరప్రసాద్, మెండెం సంతోష్‌కుమార్, మేతర అజయ్‌బాబు, పొలిమేర హరికృష్ణ, నేతల రమేష్, శ్యామ్, సర్వేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణిలను ఘనంగా సత్కరించారు. అనంతరం రేవులగడ్డ మణిసింగ్, అబ్బదాసరి జీవన్‌ప్రసాద్, చాగంటి సంజీవ్, పౌల్‌రాజు, సింగం పట్టాభి, అర్జీ ప్రసాద్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యం, సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులు, మెప్మా సిబ్బంది ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకున్నాయి. భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను జెసి లావణ్యవేణి సభికులచే చేయించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ ప్రతిజ్ఞ చేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌పై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తదితరులు సంతకాలు చేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరూ కూడా ఫ్లెక్సీ బ్యానర్ పై సంతకాలు చేశారు.

## ఆకట్టుకున్న అంబేద్కర్ చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈనెల 19వ తేదిన అమరావతిలో స్మృతివనం ప్రారంభోత్సవం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ వంటి మహోత్సవముల నేపథ్యంలో సామాజిక సమత సంకల్పం పేరిట జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా కలెక్టరేట్‌లో గోదావరి సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా సమాచార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ జీవిత చరిత్రపై ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన ఫొటోలు, ఇతర ఘటనలకు సంబంధించిన ఛాయాచిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వీటిని కలెక్టర్, జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి తిలకించారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శన తిలకించిన వారిలో పద్మశ్రీ, కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, జెసి బి.లావణ్య వేణి పాల్గొన్నారు.



ఫొటోలను తిలకిస్తున్న కలెక్టర్, ఎస్పి

## భూహక్కు కోల్పోయే చట్టం ప్రమాదకరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

యజమానులే భూమి హక్కును కోల్పోయే చట్టం ఎంతో ప్రమాదమని పలువురు న్యాయవాదులు అన్నారు. నూజివీడు పట్టణంలో కోర్టు భవనాల వద్ద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023 రద్దు కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులు చేయాల్సిన పని రెవెన్యూ శాఖకు అప్పగించటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యప్రకాష్, నరసింహారావు, రమేష్, బసవరావు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - భీమడోలు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి, అభివృద్ధికి జనసేన తన వంతు సహాయ సహకారాలు అందజేస్తుందని ఆపార్టీ ఉంగుటూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పి.ధర్మరాజు హామీ ఇచ్చారు. భీమడోలులో గురువారం నిర్వహించిన ఆటో యూనియన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. యూనియన్ గౌరవాధ్యక్షులు బాదరాల కృష్ణమోహన్ రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమోహన్ రాజు యూనియన్ ఆశయాలు, లక్ష్యాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను ధర్మరాజు దృష్టికి తెచ్చారు. అనంతరం యూనియన్ భవన నిర్మాణానికి రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని ధర్మరాజు యూనియన్ గౌరవాధ్యక్షులు చేతుల మీదుగా యూనియన్ అధ్యక్షులు సాంబశివరావు చేతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమడోలు అధ్యక్షులు పత్తి మదన్ పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

యువత క్రీడల్లో రాణించాలని చింతలపూడి ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మొలుగుమాటి నిరజుసుధాకర్ అన్నారు. చింతలపూడి మండలం రాఘవపురం గ్రామంలో ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సొసైటీ అధ్యక్షులు గిరి భోగరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



చింతలపూడిలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

**మండవల్లి :** ఆటలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆనంద్ బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐపిరపల్యంలో ఆడదాం ఆంధ్రాలో భాగంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు యువతకు ఉత్తేజాన్నిస్తాయన్నారు. ఈ టీంలు శుక్రవారం ఫైనల్స్ చేరుకుంటాయని, ఫైనల్స్‌లో గెలుపొందిన టీంలకు బహుమతులను అందిస్తామని ఆయన వివరించారు.



మండవల్లిలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

## 29న నియోజకవర్గస్థాయిలో 'రా కదలిరా'

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు కేంద్రంగా ఈనెల 29న టిడిపి ఆధ్వర్యంలో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో రా కదలిరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు త్రిసభ్య కమిటీ సభ్యులు, రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి మండలంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమడోలు మండల పరిషత్ కార్యాలయం పక్కన ఖాళీ స్థలం గాని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలోని హెలీప్యాడ్ ప్రాంతం గాని అనువుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని టిడిపి ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

## సర్పంచి, కార్యదర్శిపై గ్రామస్తులు ధ్వజం

ప్రజాశక్తి - మండవల్లి

లక్షల రూపాయలు సొమ్ము చేసుకోవడం కోసం నిబంధనలకు విరుద్ధంగా గుట్టు చప్పుడు కాకుండా వ్యక్తిగత కుళాయి కనెక్షన్లను ఇస్తున్నారంటూ సర్పంచి, కార్యదర్శిపై గ్రామస్తులు ధ్వజమెత్తారు. స్థానిక నాగేంద్ర స్వామి కల్యాణమండపంలో సర్పంచి మొండ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం మండవల్లి గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు అడుగుతున్న సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులను నిలదీశారు. గత గ్రామసభలో ఇచ్చిన హామీలను నేటి వరకు నెరవేర్చలేదని గ్రామస్తులు నిలదీశారు. జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా వ్యక్తిగత కుళాయిలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ముందుకు వస్తే సహకరించకుండా సర్పంచి, కార్యదర్శి అడ్డుపడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు, అప్పారావు, రంగారావు గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కైకలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ చేయబోయిన వీర్రాజు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా ఉచిత కుళాయిలు ఇచ్చేందుకు సర్పంచి, కార్యదర్శి సహకరించడం లేదని చెప్పడంతో ఆయన సర్పంచి కార్యదర్శిపై అసహనాన్ని వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కార్యదర్శికి, సర్పంచికి సూచించారు. అంతకుముందు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్‌లను గ్రామస్తులు దుశాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి జొన్నలగడ్డ నాగలక్ష్మి, విఆర్ఒ కమల్ హాసన్, కార్యదర్శి తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గాయాల పాలవ్వడం బాధాకరం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాల పాలవ్వడం చాలా బాధాకరమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. పెరిగేగూడెం వైసిపి నాయకులు గునిశెట్టి ప్రదీప్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారని తెలుసుకుని గురువారం ఆయన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పెరిగేగూడెం వైసిపిలో ఎంతో చురుకుగా ఉండేవాడన్నారు. అలాంటి ప్రదీప్ ప్రమాదానికి గురయ్యాడు అని తెలియగానే ఎంతో బాధ కలిగిందన్నారు. త్వరితగతిన కోలుకొని పార్టీకి అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బేతపూడి ఏసేబు రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు పెరుమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మనోధైర్యాన్ని పెంపొందించుకుని ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండాలని పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. మండవల్లి మండలం మణుగూరు గ్రామ సర్పంచి మోగనాటి తులసీ రత్నం భర్త బాబురావు ఇటీవల మృతి చెందడంతో గురువారం సర్పంచి నివాసం చేరుకుని ఆమెతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, బొల్లా బాలస్వామి, మోగంటి జాన్ బాబు పాల్గొన్నారు.



# సామాజిక తనిఖీలో భీమడోలుకు గుర్తింపు




తనిఖీ వివరాలు వివరిస్తున్న బృంద సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ పనులపై గత 15 విడతలుగా నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సందర్భంగా సున్నా శాతం రికవరీతో భీమడోలు మండలం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎ.రాము, జిల్లా విజిలెన్స్ అధికారి వి.విజయలక్ష్మి తెలిపారు. భీమడోలు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మండల స్థాయిలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పథక సంచాలకులు ఎ.రాము మాట్లాడుతూ మండలంలో సామాజిక తనిఖీ సందర్భంగా కొలతలు నమోదులో కొద్దిపాటి వ్యత్యాసం ఉన్నట్లు గమనించామన్నారు. దీని నివారణకు ఎం బుక్‌లో ఎప్పటికప్పుడు కొలతలను నమోదు చేయడం ద్వారా దీనిని అధిగమించవచ్చునని తెలిపారు. ఎవెన్యూ ప్లాంటేషన్ సందర్భంగా మొక్కల పెంపకం దశల వారిగా ఇతర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నమోదు చేయటం, కంప్యూటర్‌లో లోడ్ చేయడం ద్వారా సదరు పనులపై ఆరోపణలకు అవకాశం ఉండదన్నారు. ఉపాధి హామీ నిధులతో మండలం ఒక్కింటికి అనుసంధాన రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల కేటాయింపు జరిగినప్పటికీ వాటితో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉందని తెలియజేశారు. నూతన పనులను గుర్తింపులు గతంలో చేసిన పనులను మరొకమారు చేయటం కన్నా, నూతనంగా పనులను గుర్తించి వ్యవసాయానికి సహకరించే, గ్రామానికి అవసరమైన పనులు చేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆర్థిక సంవత్సరం చేపట్టిన రూ.13.63 కోట్లు పనులపై నిర్వహించిన తనిఖీల వివరాలు, గతంలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా నమోదైన అభ్యంతరాలపై సమీక్ష ఉంటుందని తెలియజేశారు. ఇతర శాఖ ద్వారా చేపట్టే సామాజిక తనిఖీలు కాగితాల ఆధారంగా నిర్వహిస్తారని, దీనికి విరుద్ధంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ కింద క్షేత్రస్థాయి తనిఖీ, పనుల్లో పాల్గొన్న వారి వ్యక్తిగత అభిప్రాయాలు, ఇతర అంశాలు పరిగణలోనికి తీసుకోవడం ద్వారా తనిఖీలు చేస్తారన్నారు. దీనివల్ల తనిఖీలు పారదర్శకంగా ఉంటాయన్నారు. ఉపాధి హామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో గత 15 విడతలుగా రూ.60 కోట్ల విలువ గల ఉపాధి పనులు చేపట్టారని తెలిపారు. దీనిలో 0.01 శాతం ఆడిట్ అభ్యంతరాలు ఉన్నప్పటికీ అవి సాంకేతిక లోపాల కారణంగా జరిగినట్లు గుర్తించామన్నారు. ఉపాధి హామీ పనులు అంటే కేవలం మట్టి పనులు మాత్రమే కాదని, వ్యక్తిగత సామాజిక అభివృద్ధి దీనిలో భాగస్వామిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏలూరు ఎపిడి జి.సుధాకర్, ఉపాధి హామీ ఎస్‌ఆర్‌పి గౌరీ శంకర్, ఉపాధి హామీ భీమడోలు కార్యక్రమ అధికారి సిహెచ్.పద్మావతి దేవి, ఎంపిటిసి సభ్యులు జాన్సన్, తుమ్మగుంట రంగా పాల్గొన్నారు.

## మృతుని భార్యకు రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



నగదును అందిస్తున్న మరియమ్మ

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సర్కులర్ ప్రకారం పిఎసిఎస్‌లో రుణాలు పొందిన లబ్ధిదారులు సహజ మరణం పాలైనట్లయితే సదరు కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు అందజేయడం జరుగుతుందని కెడిసిసి బ్యాంక్ ఆగిరిపల్లి బ్రాంచి మేనేజర్ కె.మరియమ్మ తెలిపారు. మండల పరిధిలోని తోటపల్లి పిఎసిఎస్‌లో పంట రుణము పొందిన లబ్ధిదారుడైన మెండె కోటేశ్వరరావు మరణించటంతో అతని భార్య మెండె జయకాంతమ్మకు గురువారం రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ సింహాద్రి నాగబాబు, సిఇఒ బెజవాడ రమేష్‌బాబులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు జగనన్న తోడు జమ : కలెక్టర్

**ఏలూరు :** జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 16,289 మంది లబ్ధిదారులకు ఒకోక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.17.23 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం జగనన్న తోడు పథకం 8వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి సంబంధించిన వడ్డీ రాయితీని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు, వడ్డీ రియింబర్స్‌మెంట్ నమూనా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిరువ్యాపారులు, సాంప్రదాయ కృత్తులవారి ఉపాధికి ఊతంగా జగనన్న తోడు నిలుస్తోందన్నారు. జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 16,289 మంది లబ్ధిదారులకు ఒకోక్కరికి రూ. 10 వేలు చొప్పున రూ. 17.23 కోట్లు లబ్ధిదారులకు జమచేయడం జరిగిందన్నారు. అదే విధంగా జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 26,339 మంది లబ్ధిదారులకు రూ. 65.62 లక్షలు వడ్డీ రీయింబర్స్ మెంట్ కింద లబ్ధిదారులకు జమచేయడం జరిగిందన్నారు.

**భీమడోలు :** జగనన్న తోడు పథకం ఎనిమిదో విడత కింద మండలానికి 456 నూతన రుణాలు మంజూరయ్యాయని వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు ఎపిఎం సురేష్ కుమార్ తెలిపారు. ఇంతవరకు మండల పరిధిలోని 595 మందికి జగనన్న తోడు పథకం కింద రూ.59.50 లక్షలు విడుదలయ్యాయన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన 150 మంది రుణ గ్రహీతలు ఒక్కొక్కరికి ప్రోత్సాహంగా తాజాగా రూ.13 వేల వంతున నూతన రుణాలను అందజేశామన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఏలూరులోని నర్సింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక పత్తేబాదలోని రెడ్‌క్రాస్ ఎఎన్ఎం నర్సింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినిలు సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు ఆడే కార్యక్రమాలను, గంగిరెద్దుల కోలాహలం, పిండి వంటలు ప్రదర్శన, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ఛైర్‌పర్సన్ బొమ్మా రెడ్డి పద్మజ వాణి, భోగిపండ్లు, భోగి మంటలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు, రంగోళి, మెహందీ, హెూంపుడ్, గాలిపటాలు, సంప్రదాయ వస్త్రధారణ, జానపద, శాస్త్రీయ నృత్యాలు మొదలైనవి నిర్వహించడం తమ పాత రోజులు జ్ఞాపకం చేశాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఇన్‌ఛార్జి సెక్రటరీ కిలారు ప్రభాకరరావు, ట్రెజరర్ చిట్టూరి జానకి రామయ్య, అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో బహుమతులు అందజేస్తున్న సభ్యులు

కమిటీ సభ్యురాళ్లు ఆర్.కమల, వై.ఉమా వాణి, బి.జ్యోతి, పద్మజలు హాజరై ముగ్గుల పోటీలు, పిండి వంటల తయారీ, పల్లెటూరి జానపద నృత్యాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, నర్సింగ్ ట్యూటర్స్ జి.జ్ఞాన వేణి, ఎ.ప్రియాంక, సిహెచ్.అనూష, ఎ.సూర్యనారాయణ, ఎం.యశోద పాల్గొన్నారు.

స్థానిక సర్ సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం 'సంక్రాంతి సంబరాల'ను విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వివి.బాలకృష్ణారావు భోగి మంటలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మన తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. చిన్నారులకు

**జంగారెడ్డిగూడెం టౌన్ :** డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. గురువారం డాంగే నగర్ అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, సిఐ పి.రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించి సాంప్రదాయాల విలువలను తెలియపరిచే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. సిఐ పి.రాజేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో జూద క్రీడల వైపు యువత మొగ్గు చూపుతూ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం న్యాయ నిర్ణేతలు ఉమర్‌ఆలీ(సంఘ సేవకులు), టి.త్రిపుర రమేష్(మానవత జిల్లా కన్వీనర్)లు ముగ్గుల పోటీల్లో ఎంపిక చేసిన విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు మానవతా మూర్తి, కె.లావణ్య, బత్తిన చిన్న, అంబేద్కర్ యువజన సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. గురువారం చేబ్రోలు జగనన్న కాలనీలో సంక్రాంతి సంబరాలను స్థానిక ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేశారు. సంబరాల్లో భాగంగా కాలనీలోని రోడ్లను రంగు రంగుల రంగవల్లులతో మహిళలు అలంకరించారు. భోగిమంటలు, చిన్నారులపై భోగిపళ్లు పోయడం, హరిదాసులు, గంగిరెద్దుల సందడి, పగటి వేషగాళ్ల మాటలగారడి, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి స్థానిక మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసల నాగమణి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాజహాన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



చేబ్రోలు వైఎస్ఆర్ కాలనీలో సంక్రాంతి సంబరాలు

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన విద్యార్థుల రక్తదానం

**ఏలూరు అర్బన్ :** భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 60 మంది ఉద్యోగులు, విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్, డ్వామా పీడీ ఎ.రాము, ఎపిఎస్‌ఆర్‌టిసి డిప్యూటీ సిటిఎం వరప్రసాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఈ రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొన్న వైద్య శాఖ, ఆర్‌టిసి, పంచాయతీరాజ్ శాఖ, డ్వామా, రామచంద్ర ఇంజనీరింగ్, పిజి కళాశాల విద్యార్థులకు, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, మెడికల్ ఆఫీసర్ ఆర్ఎస్ఆర్ కె.వరప్రసాదరావు, పాల్గొన్నారు.

## హెల్త్ క్లినిక్ సేవలు వినియోగించుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కొయ్యలగూడెం మండల పరిషత్ అధ్యక్షులు, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గంజిమాల రామారావు తెలిపారు. గురువారం కనకాద్రిపురం, కుంతలగూడెం గ్రామాల్లో నూతనంగా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈమేరకు కనకాద్రిపురం గ్రామంలోని కుంతలగూడెం పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గంగన్నగూడెం గ్రామ సచివాలయం పరిధిలోని వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం వద్దకు కనకాద్రిపురం, కుంతలగూడెం గ్రామాల ప్రజలకు వెళ్లటం దూరం అవుతున్న దృష్ట్యా వారంలో ఒకరోజు ఆ రెండు గ్రామాలకు సేవలు అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామ ఆరోగ్య అధికారి, ఎఎన్ఎం, ఆశావర్కర్ ప్రతీ గురువారం కనకాద్రిపురం గ్రామంలోనూ, శుక్రవారం కుంతలగూడెంలోనూ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సేవలు అందిస్తారన్నారు. అలాగే ప్రతీ మంగళవారం తిమ్మన్నకుంట గ్రామంలో ఈసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మిగతా సోమవారం, బుధవారం, శనివారం గంగన్నగూడెం అక్కడ ఉన్న వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ సేవలను ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సద్వినియోగించుకోవాలని ఆయన వివరించారు. ప్రజలకు ఉచిత మందులతో పాటు 14 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. గ్రామ కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కంతలగూడెం గ్రామ ఆరోగ్య అధికారి పి.సుమ, యర్రంపేట గ్రామ ఆరోగ్య అధికారి టి.విద్యాసాగర్, ఎఎన్ఎంలు షేక్ షర్మిల (కుంతలగూడెం), వి.లీల(యర్రంపేట), ఆశావర్కర్ కె.జయశ్రీ, గ్రామ సిఎ ఎస్.రత్నకుమారి పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలోని చిక్కాల నాని అనే దళిత యువకుడిపై బిసి శెట్టిబలిజ కులానికి చెందిన యాండ్ర మోహన్‌రావు కులం పేరుతో దుర్భాషలాడుతూ నడిరోడ్డుపై విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ దళిత యువకుడైన చిక్కాల నానిని పరామర్శించారు. చిక్కాల నాని దళిత యువకుడు అగ్రకులానికి చెందిన గన్నిన సూర్యచంద్రం వద్ద పాలేరుగా పనిచేస్తున్నారని, గేదెలు మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారని ఫ్రాన్సిస్ తెలిపారు. ఈ క్రమంలో గేదెలు మేపే సమయంలో యాండ్ర మోహన్ రావు తోటలోకి గేదెలు చొరబడ్డాయనే నెపంతో యాండ్ర మోహన్‌రావు కులం పేరుతో దుర్భాషలాడుతూ నడిరోడ్డుపైనే దళిత యువకుడైన చిక్కాల నానిని చితకబాదాడన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు పాల్గొన్నారు.

## నిధులు దోచేయడం సిగ్గుచేటు

### వాడీవేడీగా ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**ఉంగుటూరు :** సర్పచులకు తెలియకుండా, మా సంతకాలు లేకుండా 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం లాగేస్తే ఇంక పంచాయతీల్లో ఏమి చేయాలని చేబ్రోలు సర్పంచి రాంథే లక్ష్మీసునీత అన్నారు. అంగన్వాడీలు సమ్మెను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం కారణంగా పౌష్టికాహారాన్ని అందించడంలో సచివాలయం సిబ్బంది విఫలం అయ్యారన్నారు. గురువారం ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సర్పంచులు సమస్యలను ఏకరుపెట్టడం, అధికార పార్టీ సర్పంచులు సైతం సమస్యలను సభ దృష్టికి తేవడం వాడీ వేడీగా కేకలు, అరుపులతో సాగింది. పంచాతీయల్లో విద్యుత్ బిల్లులు, రీడింగ్ ఎప్పుడు ఎవరు తీస్తున్నారో ఈరెండున్నర ఏళ్లల్లో మాకెవరూ సమాచారం ఇవ్వలేదని చేబ్రోలు సర్పంచి అన్నారు. మా సంతకాలు లేకుండా మా ప్రమేయం లేకుండా రూ.32 లక్షలు లాగేసుకోవడం ఎంతవరకూ న్యాయమని, దీనికి సంబంధించి విద్యుత్ బిల్లులు ఇవ్వాల్సిందిగా ఆమె డిమాండు చేశారు. బడ్జెట్ విడుదల అయ్యాక ఉన్నతాధికారులే పంచాయతీ నిధుల నుంచి కరెంటు బిల్లులకు మినహాయించుకుంటున్నారని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ వివరించారు. కొత్తగా మంజూరు చేసిన పింఛన్ల వివరాలు, లబ్ధిదారుల పేర్లు సైతం టిడిపి సర్పంచులకు తెలియడం లేదని, అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ శిలాఫలకాల్లో సర్పంచుల పేర్లు లేకుండా అవమానించడం ధారుణమని లక్ష్మీసునీత, తల్లాపురం, కాకర్లమూడి సర్పంచులు పి.నరశింహారావు, నాగపండులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కుపల్లిగోకవరం సర్పంచి మిద్దే సత్యవతి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. నైటీ డేస్ పథకంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్న 39 మందికి పట్టాలు సిద్ధం చేస్తున్నామని తహశీల్దారు రమణారావు అన్నారు. నానో యూరియా వినియోగంపై ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ ప్రేమాన్విత కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి సింగిరెడ్డి సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని పలు శాఖ అధికారులకు నోటీసులు పంపాలన్నారు.

### శ్రీ కోర్టు వారి పత్రికా ప్రకటన

**In the Court of the Principal Jr Civil Judge Tanuku**

**O.S.No.322/22**

**Between :**

UBI (Erstwhile Andhra Bank) Rep by its Sr Manager Relangi Branch ...Plaintiff

And

1. Vemula Krishna, S/o Venkata Ratnam, D.No.21-6-7, Yedla Bazar, W.No.14, Palakollu (M), W.G.Dist, AP.
2. Vemula Vardhana Rao, S/o Chiranjeevi, Door. No.4-105, Gaggiparru (V), Kontheru (P), Yelamanchili (M), W.G.Dist ...Defendents

పై నంబరు గ్రంథంలో వాది మీ పై బ్యాంక్ లోను రికవరీ నిమిత్తం పై దావా చేసినారని అందులో ప్రతివాదులయిన మీరు అనేక సార్లు శ్రీ కోర్టు వారు మీకు కోర్టు ద్వారాను, తపాల ద్వారాను మీకు పంపించిన దావా సమన్లు మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా కాలయాపన చేసిన కారణంగా సదరు శ్రీకోర్టు వారు యిందు మూలముగా సదరు దావా సమన్లను యీ పత్రికా ప్రకటన ద్వారా దావా సమన్లు ఆర్డరు చేసినందున సదరు పై నంబరు గ్రంథంలో **ది.05-02-2024 తేదీన** మీ హాజరు నిమిత్తం వాయిదా అయియున్నదని ఆ రోజున మీరు వ్యక్తిగతముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10.30 గంటలకు** హాజరు కావలెనని, లేనిచో పై నెంబరు గ్రంథంలో మీకు పరోక్షముగా శ్రీకోర్టువారు ఆర్డరు చేయుదురని యిందుమూలముగా తెలియపరచడమైనది.

**వాయిదా : 05-02-2024.**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**వాది తరపు అడ్వకేట్**
E.S.V.B. Madhavi
Panel Advocate, Bhimavaram.

### In the Court of the I Additional Junior Civil Judge, Eluru

**O.S. No. 510/2021**

*Between:*

Smt. Pamarthi Lakshmi Kanthamma ***...Petitioner/ Plaintiff***

AND

Smt. Pajjuri Sivamma & 4 Others ***...Respondents/ Defendants***

పై నంబరు పిటీషనులో 5వ రెస్పాండెంటు అయిన **D-5:** శ్రీ కాశీ రవికుమార్ @ కృష్ణ, Eluru City President of Andhra Pradesh, Dalitha Hakkula Porata Samithi, O/o. Spurthi Bhavan, R.R.Pet, Eluru, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 22-1-2024 రోజున వాయిదా అయివున్నది.** సదరు వాయిదా రోజు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకి హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు **ఈ.శ్రీనివాసబాబు**
ది.10-1-2024 అడ్వకేటు, ఏలూరు

### వేలం ప్రకటన

**మహారాజశ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఇ.పి. 37/2018 ఇన్ ఓ.యస్. నెం. 494/2015**

*బిట్వీన్:*

వాసా శ్యామలాంబ అనే శ్యామల ***-డి. హెచ్. ఆర్.***

మరియు

నీలపాల సత్యవతి ***-జే.డి. ఆర్.***

కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, ముసునూరు మండలం, గోపవరం పంచాయితీ, ముసునూరు మండలం, గోపవరం గ్రామ ఆర్.యస్. నెం. 305/6 దాఖలా య. 0-07 1/2 సెంట్లు లేక 363 చ॥గజముల నివేశన స్థలం మరియు సదరు స్థలంలో నిర్మింపబడియున్న డోర్ నెం. 1-25 దాఖలా ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి అమర్చబడిన యావత్ పరికరములతో సహా పై తెలిపిన జే.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో వుండి, ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు.

**తూర్పు:** 5 గజముల నడక దారి.
**దక్షిణం:** నల్లిబోయిన నాగేశ్వరమ్మ గారి స్థలం.
**పడమర:** సాయిల చిట్టియ్య గారి స్థలం.
**ఉత్తరం:** 4 గజముల నడక దారి.

***డి. హెచ్. ఆర్. విలువ: రూ. 10,00,000/-***
***అమీనా విలువ: రూ. 15,00,000/-***

పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు **ది. 29-01-2024 తేదీన ఉదయం 10.30 ని॥లకు** బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సినవారు పాడుకొనవచ్చును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**యమ్.రమేష్**
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, నూజివీడు

### గ్రామపంచాయతీ కార్యాలయం, వేల్పూరు

**తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా**

**టెండరు ప్రకటన**

రి.క. నెం.1/2024 తేది.10-01-2024

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, వేల్పూరు గ్రామపంచాయితీ నందు 2023-2024 సంవత్సరమునకు అనగా ది. 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలమునకు ది. 18-01-2024 తేది గురువారం ఉదయం గం॥ 11ల నుండి మధ్యాహ్నం గం॥ 1 వరకు వేల్పూరు గ్రామపంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి గారు లేదా వారి అనుమతి పొందిన వారితో గాని టెండర్లు స్వీకరించబడును. మరియు అదేరోజు అనగా ది. 18-01-2024 నిర్ణయింపబడిన మధ్యాహ్నం గం॥ 3లకు వేల్పూరు గ్రామపంచాయితీ కార్యాలయము నందు అప్పటికి హాజరు కాబడిన టెండర్లదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును అని తెలియజేయడమైనది. టెండర్లు నిలుపుదల చేయుటకు లేదా వాయిదా వేయుటకు గ్రామపంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు పంచాయితీ కార్యాలయపు పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూల్

| వ.నెం. | కావలసిన సామగ్రి | కావలసిన వస్తువుల సంఖ్య | టెండరు ధరావత్తు |
|---|---|---|---|
| 1. | ప్రజారోగ్య పారిశుద్ధ్య సామాగ్రి | చేతిపారలు, కర్రపారలు, చెత్త డబ్బాలు, ఫినాయిల్, యాసిడ్, చీపుర్లు, మొదలగు పారిశుద్ధ్య సామాగ్రి | రూ. 5000/- |
| 2. | బ్లీచింగు, సున్నం | 95 బస్తాలు, 18 టన్నులు | రూ. 5000/- |
| 3. | విద్యుత్ సామాగ్రి విడిభాగాలు STL, LED's ఫిటింగ్స్, కరెంటు లైట్లు | 36 వాట్ లైట్స్ 200, 24 డ్రైవర్స్ 400 36 ప్లేట్ 150, 24 LED 100, 320 వైర్ - 6, 718 వైర్ 3 కట్టలు 20 MCP 50, టేపులు 25, పైపులు, క్యాంపులు | రూ. 5000/- |
| 4. | మంచినీటి సరఫరా | మంచినీటి సరఫరా సామాగ్రి GI పైపులు PVC పైపులైను, ట్యాపులు మరియు ఇతర సామాగ్రి | రూ. 5000/- |
| 5. | స్టేషనరీ | బుక్స్ & ఫారంలు, రిజిష్టర్, A4 పేపర్లు, పెన్నులు, ఇతర సామాగ్రి | రూ. 5000/- |
| 6. | పారిశుద్ధ్య సిబ్బంది బట్టలు | చీరలు, కాకి ప్యాంట్‌లు, కాకి షర్ట్‌లు | రూ. 5000/- |

సం/- **విశ్వనాథం కృష్ణవేణి**
సర్పంచ్
గ్రామపంచాయితీ, వేల్పూరు

సం/- **వి.గంగాధరరావు,**
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, వేల్పూరు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా